

సమావేశంలో పాల్గొన్న ఆయా శాఖల అధికారులు (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజార్షి షా

పాఠశాలల్లో మౌలిక వసతుల పనులను జూన్ 10లోగా పూర్తి చేయాలి

● జిల్లా కలెక్టర్ రాజార్షి షా

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 1: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీతో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులకు సంబంధించిన పనులను జూన్ 10లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ, లేబర్ మొబిలైజేషన్, స్కూల్ డ్రెస్సెస్ స్టిచింగ్, పోస్టల్ పేమెంట్, పీఎంఈఎస్‌వై వర్క్ ప్రోగ్రెస్, నర్సరీలపై ఆర్‌డబ్ల్యూఎస్, ఎంపీడీవో, ఇంజనీర్స్, ఎంపీవో, డీపీవో, ఏపీవో, ఎస్‌ఈ, ఏఈ, ప్రత్యేక అధికారులు, తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో గ్రామాలలో నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సంబంధిత అధికారులను ఆదేశించారు. తీవ్ర నీటిఎద్దడి ఉన్న చోట ట్యాంకర్స్ ద్వారా ఇంటింటికి నీటిని సరఫరా చేయాలని, గ్రామాల్లో ప్రస్తుతం తాగునీటి సరఫరా, బోర్లు, ఓపెన్‌బావులు, నీటి వనరుల గురించి మండలాల వారీగా ఎంపీడీవో, ఎంపీవో, ఏఈలను ఎక్కడెక్కడ నీటి సమస్య ఉందో? అడిగి తెలుసుకున్నారు. తాగునీటి విషయమై పైప్ లైన్, మోటార్ల మరమ్మతులు, తదితరాలు వెంటనే పూర్తి చేయాలన్నారు. తాగునీటి సరఫరాలో వచ్చే చిన్నచిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. బోరుబావులు, పాత తాగునీటి వనరులు పునరుద్ధరించాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని సమ్మర్ యాక్షన్ ప్లాన్ రెండు రోజుల్లో సమర్పించాలని, ఎండ తీవ్రతని దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో నీటి సమస్య లేకుండా అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని సూచించారు. మిషన్ భగీరథ నీరు రాని చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజలు బావుల వద్దకు, బయటకు రాకుండా ఇంటింటికీ నీటిని సరఫరా చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆదేశించారు. సంబంధిత అధికారులు గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి సరఫరాపై సమీక్షిస్తూ గ్రామాలలో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా క్షేత్రస్థాయిలో నీటి లభ్యత, సరఫరాలపై పర్యవేక్షిస్తూ ఉండాలని, అలాగే పైపులైన్ లీకేజీలు ఉండకుండా మరమ్మతులు చేయించాలని, అధికారులు హెడ్‌క్వార్టర్ మెయింటెన్ చేయాలని ఆదేశించారు. అలాగే అమ్మఆదర్శ పాఠశాల కమిటీచే ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులకు సంబంధించిన పనులను పూర్తి చేయాలని ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి సౌకర్యం,తరగతి గదుల మేజర్, మైనర్ మరమ్మతులు, టాయిలెట్లను, బాలికల కోసం అదనపు టాయిలెట్ల నిర్మాణ పనులు, విద్యుత్ సౌకర్యం, పెయింటింగ్ వంటి మౌలిక వసతుల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత లేబర్ మొబలైజేషన్, నర్సరీ, స్కూల్ డ్రెస్, తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సమీక్ష సమావేశంలో ట్రైనీ కలెక్టర్ వికాస్‌మెహతా, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయన్న, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రచారస్త్రాలు.. సిద్ధం!

- జిల్లాలో సాగు, తాగునీటి సమస్యలే ప్రధాన ఎజెండాగా ముందుకెళ్తున్న పార్టీలు
- దీర్ఘకాలిక సమస్యలపై దృష్టి సారిస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు
- తమను గెలిపిస్తే రెండింతల అభివృద్ధి అంటూ ప్రచారం
- పోటాపోటీ హామీలతో ఓట్లు రాబట్టేందుకు ముమ్మర ప్రయత్నాలు
- లోక్‌సభ ఎన్నికలతో మళ్లీ తెరపైకి జిల్లా సమస్యలు

ఆదిలాబాద్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రచారం ఊపందుకోవడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నారు. ప్రత్యర్థి పార్టీల కన్న పైచేయి సాధించేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే పార్టీ ప్రకటించిన హామీలతో పాటు అభ్యర్థులు స్థానికంగా జిల్లాస్థాయి హామీలను జత చేస్తూ ప్రచారానికి పదును పెడుతున్నారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై దృష్టి సారిస్తున్నారు. అందుబాటులో ఉన్న సోషల్ మీడియా వేదికగా కొత్తరకం ప్రచారానికి శ్రీకారం చుడుతున్నారు. నియోజకవర్గాల్లో పర్యటించే ముందు స్థానిక నేతలతో మంతనాలు జరుపుతు అక్కడి సమస్యల పైననే ప్రధానంగా దృష్టి సారిస్తున్నారు. జిల్లా వెనుకబాటుకు సాగు, తాగు నీరే ప్రధాన కారణమని చెబుతునే తాము అధికారంలోకి వస్తే పరిష్కార మార్గం చూపుతామని నమ్మ బలుకుతున్నారు. గత ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులు అసంపూర్తిగానే మారడంతో వాటినే ప్రధాన ప్రచారస్త్రాలుగా చేసుకుంటున్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలపై మాటల యుద్ధానికి దిగుతు విమర్శనాస్త్రాలను విసురుకుంటున్నారు. అంతేకాకుండా ఇప్పటికే చేసిన అభివృద్ధితో పాటు మళ్లీ అధికారం కట్టబెడితే మరింత అభివృద్ధి చేసి చూపుతామని బీజేపీ నేతలు చెబుతున్నారు. ఎన్నికల సమయంలో మళ్లీ జిల్లా సమస్య లను తెరపైకి తెస్తూ ఓటర్లను ఆశల్లో ముంచెత్తుతున్నారు. నియోజక వర్గాల వారీగా ఓటర్ల నాడిని పసిగడుతున్న అభ్యర్థులు దాననుగుణం గానే ప్రసంగాలు చేస్తూ మద్దతును కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. అయితే అందరికీ జై కొడుతున్న ఓటర్లు ఎవరికి అండగా నిలుస్తారో? అంతు చిక్కని పరిస్థితి కనిపిస్తుంది.

అందరి దృష్టి సాగు, తాగునీటిపైనే..

జిల్లాలో అంతంతమాత్రంగా కనిపిస్తున్న సాగు, తాగునీటి పైననే ప్రధాన పార్టీల అభ్యర్థులు దృష్టి సారిస్తున్నారు. దీనినే ప్రధాన ఎజెండాగా మార్చుకుని ప్రచారానికి సిద్ధమవుతున్నారు. సారవంతమైన సాగు భూములు ఉన్నప్పటికీ.. నీటి వసతులు లేక వేల ఎకరాల భూములు బీడు వారి పోతున్నాయి. ఇప్పటికే గత ప్రభుత్వం ఈ దిశగా అడుగులు వేసినప్పటికీ.. అనుకున్నంత స్థాయిలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయలేకపోయింది. సరిపడా వర్షపాతం, నీటి వనరులు ఉన్నా.. వరద నీటికి అడ్డుకట్ట వేసి సద్వినియోగం చేసుకోలేక పోవడమే జిల్లా రైతాంగానికి శాపంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయ పార్టీలన్నీ రైతాంగానికి మరింత దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నాయి. ఇప్పటికే పనులు ప్రారంభించిన కోర్టా-చనకా బ్యారేజీతో పాటు హత్తిఘాట్ పంప్‌హౌజ్ అందుబాటులోకి రాకపోవడంతో ఆయకట్టు ప్రశ్నార్థకంగానే మారింది. అలాగే బోథ్ నియోజకవర్గంలో కుప్టి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని గత కొన్నేళ్లుగా డిమాండ్లు వస్తున్నాయి. అయినా అడుగు ముందుకు పడిన పరిస్థితి కనిపించడం లేదు. అలాగే చిక్‌మాన్ ప్రాజెక్టు మరమ్మతులు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణాన్ని ప్రతిపాదనలు పంపినా.. ఆచరణలో సాధ్యం కావడం లేదు. దీంతో పాటు మారుమూల గిరిజన గ్రామాలకు తాగునీటి సరఫరా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని అమలు చేసిన ఆశించిన స్థాయిలో ఫలితం లేదంటున్నారు. జిల్లాలోని వందలాది గ్రామాలకు మిషన్ భగీరథ అందని ద్రాక్షగానే మారిందంటున్నారు. ఇప్పటికి ఎన్నో గ్రామాలు వ్యవసాయ బావులు, బోరుమోటర్ల పైననే ఆధారపడి దాహం తీర్చుకుంటున్నారు. ఈ పరిస్థితికి గత ప్రభుత్వమే కారణమంటూ ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు. ఇలా అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య సాగు, తాగు నీటి సమస్యల ప్రధానంగా విమర్శలు కనిపిస్తున్నాయి.

తెరపైకి దీర్ఘకాలిక సమస్యలు

ప్రభుత్వాలు, పాలకులు మారిన జిల్లాలో ఎన్నో దీర్ఘకాలిక సమస్యలు నేటికి పరిష్కారానికి నోచుకోలేదు. మళ్లీ లోక్‌సభ ఎన్నికలు సమీపించడంతో ప్రధాన పార్టీలన్నీ జిల్లాలోని దీర్ఘకాలిక సమస్యలను తెరపైకి తెస్తున్నాయి. ప్రధానంగా సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణ, ఎరోడ్రమ్ నిర్మాణం, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు, ఆదివాసీల ఉద్యమ సమస్యలతో పార్టీలు ముందుకెళ్తున్నాయి. జిల్లాలో ప్రధానంగా చెప్పుకునే పరిశ్రమలు లేకపోవడంతో ఉపాధి అవకాశాలు కరువవుతున్నాయి. సీసీఐ పరిశ్రమతో పాటు రేణుక సిమెంట్ పరిశ్రమ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను నెలకొల్పేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలన్నా డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఉన్నత విద్య అవకాశాలు లేక నిరుపేద గిరిజనులు చదువులకు దూరమవుతున్నారు. గతంలో ఉట్నూర్‌లో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్న యూనివర్సిటీ ఇతర జిల్లాలకు తరలిపోవడంపై జిల్లావాసులు ఆగ్రహంతో కనిపిస్తున్నారు. ఏదో ఒక యూనివర్సిటీని ఏర్పాటు చేస్తే స్థానికంగానే ఉన్నత విద్య అవకాశాలు అందుబాటులో ఉంటాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిసారి ఎన్నికల్లో ఏదో సమస్యను తెరపైకి తేవడం.. ఆ తర్వాత మరిచిపోవడం ప్రధాన పార్టీలకు పరిపాటిగా మారిందంటున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉంటేనే అభ్యర్థులకు అండగా ఉంటామన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మళ్లీ అధికారంలోకి వస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని బీజేపీ చెబుతుండగా తమ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపుతామంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు హామీలు గుప్పిస్తున్నాయి. అయితే ఏళ్ల తరబడి దీర్ఘకాలిక సమస్యలు కేవలం ఎన్నికల ప్రచార అస్త్రాలుగానే మిగిలి పోవడంతో.. ప్రస్తుతం జిల్లావాసులు అభ్యర్థుల హామీలను నమ్మే పరిస్థితుల్లో లేదన్నది చర్చనీయాంశంగా మారింది.

పోటాపోటీ ప్రచారం

ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు కావడంతో ఇక పోటాపోటీ ప్రచారానికి సిద్ధమవుతున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తమ అభ్యర్థిని గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యమంటూ చెబుతుంది. జిల్లాలో అసంపూర్తిగా కనిపిస్తున్న ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్ నిర్మాణం పనులను ప్రారంభిస్తామని, అలాగే కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని బీజేపీ నేతలు చెబుతున్నారు. అలాగే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పలు సంక్షేమ పథకాలు, గ్యారంటీలను అమలు చేస్తూ తమ అభ్యర్థిని గెలిపిస్తే గ్యారంటీలకు ఢోకా లేదంటూ ప్రచారానికి శ్రీకారం చుడుతున్నారు. పెండింగ్ సమస్యల పరిష్కారానికి కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు. గతంలో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలతో ప్రచారం చేపడుతున్న బీఆర్ఎస్ నేతలు తమ అభ్యర్థికి మద్దతుగా నిలవాలని కోరుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జిల్లా ఎంతో అభివృద్ధి జరిగిందంటూ చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. అదేవిధంగా దీనికి తోడు ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ఆదివాసీలే కావడంతో ప్రధానంగా గిరిజన సమస్యలపై ప్రత్యేకదృష్టిని సారిస్తూ ఆదివాసీలు, లంబాడాల మద్దతును కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇలా పోటాపోటీగా హామీలు గుప్పిస్తూ ప్రచారం చేపట్టడం తో ఓటర్లు అయోమయ పరిస్థితుల్లో పడుతున్నారు. ప్రస్తుతం అంతా బాగానే కనిపిస్తున్నా.. చివరికి ఓటర్లు ఎవరికి జై కొడుతారో? మరికొంత కాలం వేచిచూడాల్సిందే మరీ..!!



గిరిజన గ్రామంలో నీటి బావిని పరిశీలిస్తున్న ఐటీడీఏ అధికారి

తాగునీటి సమస్యపై అధికారుల పరిశీలన

ఉట్నూర్, ఏప్రిల్ 1: ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త ఆదేశాల మేరకు గిరిజన గ్రామాలలో ఏర్పడుతున్న మంచి నీటి సమస్యల పరిష్కారం కోసం అధికారుల బృందం పర్యటిస్తున్నట్లు ఐటీడీఏ వర్గాలు తెలిపాయి. సోమవారం ఐటీడీఏ విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి జగన్ ఆధ్వర్యంలో తాంసి మండలంలోని అట్నంగూడ, లింగూడ, గిరిగాంవ్‌లను సందర్శించి గిరిజనులు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యను తెలుసుకున్నారు. గిరిజనులు అత్యవసరం కోసం తప్పని పరిస్థితుల్లో వ్యవసాయ బావుల నీరు తాగుతున్నట్లు వివరించారు.ఈ సందర్భంగా అధికారుల బృందం గ్రామ పంచాయతీ మండల పరిషత్ అధికారుల నుంచి వివరాలు సేకరించారు. ఈ మూడు గిరిజన గ్రామాలలో మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి నివేదిక సమర్పిస్తామని ఆత్రం జగన్ వివరించారు. ఆయన వెంట ఎస్సీఈఆర్పీ నానాజీతో పాటు స్థానిక గిరిజనులు, తదితరులు ఉన్నారు.

● 'పథకాలు పని చేయకుంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు'

ఉట్నూర్: 'ఆంధ్రజ్యోతి' ఆదిలాబాద్ జిల్లా అనుబంధంలో సోమవారం 'ఏజెన్సీలో దాహం దాహం' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి మిషన్ భగీరథ ఏంట్రా డివిజన్ అధికారులు స్పందించారు. జిల్లాలోని ప్రజలకు మంచినీరు అందించడానికి మిషన్ భగీరథ పథకం ద్వారా 972 ఓహెచ్ ఆర్‌లు నిర్మించడం జరిగిందని, 2100 కి.మీ. పైపులైన్లు నిర్మించామని వారు తెలిపారు. అనివార్య కారణాల వల్ల మంచినీటి సరఫరా నిలిచి పోయినప్పుడు ప్రత్యామ్నాయ ఏర్పాట్లయిన చేతిపంపులు, బావులు ఉపయోగించుకోవాలని స్థానిక సిబ్బందికి ఆదేశించామన్నారు. ఉట్నూర్ ఇంద్రవెల్లి, సిరికొండ, నార్నూర్ మండలాల్లో బోరుబావులు, మంచినీటి పథకాలు పని చేస్తున్నాయని పేర్కొన్నారు. పథకాలు పని చేయనప్పుడు వేసవి ప్రణాళికలో భాగంగా మిషన్ భగీరథ పైపులైన్‌లను మరమ్మతులు చేస్తున్నామని తెలిపారు. అదే విధంగా అవసరమైన చోట కొత్త బోరు బావులు వేస్తున్నామని వివరించారు. మంచినీటి ఇబ్బందుల గురించి ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు.

పట్టణంలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు : మున్సిపల్ చైర్మన్

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 1: వేసవిలో పట్టణవాసులకు నీటి ఎద్దడి తలెత్తకుండా మున్సిపల్ యంత్రాంగం తరఫున పూర్తి చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని ఫిల్టర్ బెడ్‌లో మున్సిపల్ నిధులతో జరుగుతున్న పైప్‌లైన్ మరమ్మతు పనులను ఆయన పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని చిన్నపాటి మరమ్మతులను పూర్తి చేస్తున్నామన్నారు.మున్సిపల్ ప్రజలకు తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఆయా శాఖల అధికారుల సమన్వయంతో ముమ్మర పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఇందులో కౌన్సిలర్ భూమన్న, సృజన్, మూర్తి తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ

బజార్‌హత్నూర్, ఏప్రిల్ 1: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సాధన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని పలు రికార్డులను, మందుల వివరాలను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో అందించే వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. మారుమూల గ్రామాల నుంచి వచ్చే రోగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలందించాలని, గర్భిణులకు అవసరమైన చికిత్సలను చేసి మందులు అందించాలన్నారు. ఇందులో వైద్యులు భీంరావు, శిల్ప, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం : ఎస్సై

భీంపూర్, ఏప్రిల్ 1: ఓటు వజ్రాయుధమని ఎస్సై ప్రదీప్‌కుమార్ అన్నారు. మండలంలోని నిపాని గ్రామంలో సోమవారం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఓటు హక్కు వినియోగించుకుంటాం అని ఓటర్లు ప్రతిజ్ఞ చేశారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు తమ పాటలతో అవగాహన కల్పించారు. ఇందులో గ్రామపెద్దలు రాజన్న, మార్శెట్టి అనిల్, ముకుందా సంతోష్, రామన్న, ఎస్‌సైకే సిబ్బంది షేక్ మజీద్, కళాకారులు గట్టు వెంకట్‌రావు, రమేష్, నర్సమ్మ, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించాలి'

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 1: ఎన్నికల్లో విధులు నిర్వహించే ఉద్యోగ ఉపాధ్యాయులు ఎదుర్కొనే సమస్యలు పరిష్కరించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నూరుసింగ్ కోరారు. ఈ సందర్భంగా నాయకులతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజార్షిషాకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల సిబ్బందికి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, వ్యాధిగ్రస్థులైన ఉద్యోగులకు విధుల్లో మినహాయింపు ఇవ్వాలన్నారు.

ఉద్యోగులకు శిక్షణ తరగతులు

ఇచ్చోడ, ఏప్రిల్ 1: పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వహించే పీవో, ఏపీవోలకు సోమవారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమైనట్లు తహసీల్దార్ తుకారాం పేర్కొన్నారు. ఈనెల 4వరకు వీరికి శిక్షణ కొనసాగుతుందని, పోలింగ్ బూత్‌లలో విధులు ఎలా నిర్వహించాలి, పలు అంశాలపై ట్రైనింగ్‌లో అవగాహన కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు.



శిక్షణ తరగతులకు హాజరైన ఉద్యోగులు

రాహుల్‌గాంధీని ప్రధానిగా చూడడమే లక్ష్యం

● అందరూ ఏకతాటిపై పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి ● కాంగ్రెస్ పార్లమెంట్ స్థాయి సన్నాహక సమావేశంలో మంత్రి సీతక్క



ఇచ్చోడలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క



హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 1: పేద వర్గాల హక్కులు కాపాడే రాజ్యం రావాలంటే అది కాంగ్రెస్‌తోనే సాధ్యమని, రాహుల్‌గాంధీని భావిభారత ప్రధానిని చేస్తేనే అన్ని వర్గాల సమస్యలు పరిష్కారమవుతాయని, అదే మన లక్ష్యమని మంత్రి సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం కాంగ్రెస్ పార్లమెంట్ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. దీనికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణలు పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై మంత్రి సీతక్క శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా అందరు ఏకతాటిపైకి వచ్చి భేషజాలు వీడి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. త్యాగాల వారసత్వాన్ని పునికిపుచ్చుకుని మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న తమ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీని భావిభారత ప్రధానిగా చూడడమే లక్ష్యమన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్, బీజేపీలు ఏం చేయలేదనే ప్రజలు ఇంటికి పంపించారని అన్నారు. నల్లధనాన్ని వెలికితీసి ప్రతీ పేదవాని ఖాతాలో రూ.15లక్షలను జమ చేస్తామని చెప్పి మోదీ మోసం చేశారన్నారు. ఈ దేశంలో పేదలకు అనేక హక్కులు కల్పించిందే కాంగ్రెస్ పార్టీ అన్నారు. ప్రతీఒక్కరు చదువుకోవాలని విద్యా హక్కును కల్పించిందని, ఆహార భద్రత చట్టాన్ని తీసుకొచ్చిందని అన్నారు. కానీ ఇవాళ భక్తి పేరుతో, భగవంతుడి పేరుతో రాజకీయాలు చేస్తూ బీజేపీ పబ్బం గడుపుకుంటుందన్నారు. ఆదానీలు, అంబానీలకు పెద్దపీట వేస్తూ పేదల సంక్షేమాన్ని విస్మరిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలను కుదేలు చేసి ప్రైవేట్ వ్యక్తులకు వాటిని ధారాదత్తం చేస్తున్నారని, బీజేపీ, బీఆర్ఎస్ హయంలో ఇప్పటి వరకు ఎంత మందికి ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయో? చెప్పాలన్నారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే 30వేల ఉద్యోగాలిచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనని అన్నారు. కులమతాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయం చేసే వారిని గమనించి జనం అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఆ తర్వాత ఎమ్మెల్యే వెడ్మబొజ్జు మాట్లాడుతూ మనందరి లక్ష్యం ఒక్కటేనని ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థిని గెలిపించుకోవడమేనని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పిదాలను ఎలా ఎండగట్టామో.. అదే రకంగా ఈ పార్లమెంట్ ఎన్నికల్లోను ఆ దిశగానే ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డనైనా తనకు కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించిందని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా చూసుకుంటానని, భారీ మెజార్టీతో గెలిపించి లోక్‌సభకు పంపాలని కోరారు. ఇందులో టీపీసీసీ ఉపాధ్యక్షుడు సత్తు మల్లేష్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ చైర్మన్ ముడుపు దామోదర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా అసెంబ్లీ ఇన్‌చార్జీలు ఆడే గజేందర్, శ్యాంనాయక్, కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, ఎస్టీ సెల్ జిల్లా చైర్మన్ సెడ్మకి ఆనంద్‌రావు, డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ, తదితరులు పాల్గొన్నారు.

● 'కాంగ్రెస్ విజయానికి కృషి చేయండి'

ఇచ్చోడ: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించేలా పార్టీ నేతలు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకెళ్లాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఇచ్చోడ మండల కేంద్రంలోని షార్ప్ గార్డెన్‌లో సోమవారం నిర్వహించిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా ఆత్రం సుగుణక్కను గెలిపించి కేంద్రంలో రాహుల్‌గాంధీని ప్రధానమంత్రి చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఆమె అన్నారు. పాత, కొత్త పంచాయితీలను పక్కన పెట్టి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కష్టపడ్డా ప్రతీ కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధించాలంటే ప్రతీఒక్క కార్యకర్త అభ్యర్థిలాగా కష్టపడాలన్నారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు 500మంది మంత్రి సీతక్క ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఇందులో ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణక్క టీపీసీసీ జనరల్ సెక్రెటరీ సత్తు మల్లేష్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బోథ్ నియోజకవర్గ ఇన్ చార్జీ ఆడె గజేందర్, జడ్పీటీసీలు గోక గణేష్‌రెడ్డి, మల్లెపూల నర్సయ్య, జిల్లా అధి కార ప్రతినిధి పసుల చంటి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రఫుల్ చందర్‌రెడ్డి, మహిమూద్ ఖాన్, మండల కన్వీనర్ కళ్లెం నారాయణరెడ్డి, తదితరులున్నారు.

బోరజ్ ఎక్స్ రోడ్డు దగ్గర రూ.3.63లక్షల నగదు పట్టివేత

జైనథ్, ఏప్రిల్ 1: మండలంలోని బోరజ్ ఎక్స్ రోడ్డు దగ్గర ఎస్సై వి.పురుషోత్తం ఆధ్వర్యంలో మంగళవారం వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో రూ.3,63,000 లక్షల నగదును పట్టుకున్నారు. దీనిలో భాగంగా ఎస్సై మాట్లాడుతూ జైనథ్‌కు చెందిన పి.శ్రీనివాస్ మ్యాక్స్ (ఏపీ018 1369) వాహనంలో ఆదిలాబాద్ నుంచి జైనథ్ వైపు వెళ్తుంగా.. ఆ వాహనాన్ని తనిఖీ చేసే క్రమంలో ఆయన దగ్గర ఉన్న రూ.3,63,000 నగ దును స్వాధీన పర్చుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కటిక వ్యాపారి అయిన శ్రీనివాస్ ఇచ్చోడ మార్కెట్‌లో మేకలను అమ్మి వస్తుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. కాగా, ఆయన దగ్గర డబ్బుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఆ నగదును జైనథ్ మండల ఫ్లయింగ్ స్క్వాడ్ టీం లీడర్ ముత్యం రావుకు అప్పగించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ నరేష్, హోంగార్డు అనిల్, డ్రైవర్ జహీర్‌లతో పాటు జైనథ్ మండల పోలీసు సిబ్బంది ఉన్నారు.



పట్టుకున్న నగదును చూపుతున్న జైనథ్ ఎస్సై పురుషోత్తం

నాగోబాను దర్శించుకున్న ట్రైనీ కలెక్టర్

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 1: ఆదివాసీల ఆరాధ్య దైవం కేస్లాపూర్ నాగోబా దేవతను నిజామాబాద్ జిల్లా ట్రైనీ కలెక్టర్ కిరణ్మయి దర్శించుకున్నారు. సోమవారం ఉట్నూరు ఐటీడీఏ అధికారులతో కలిసి నాగోబా ఆలయాన్ని సందర్శించారు. నాగో బా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉట్నూర్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్‌లు నాగోబా ఆలయ విశిష్టతను గురించి తెలిపారు. అనంతరం నాగోబా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ట్రైనీ కలెక్టర్ కిరణ్మయిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ జేడీఎం నాగభూషణం, ఏవో రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ట్రైనీ కలెక్టర్ కిరణ్మయి

రంజాన్ వేళలు

మంగళవారం	బుధవారం
ఇఫ్తార్	సహర్
సా.6.34	ఉ.4.48



తల్లిదండ్రుల పట్ల సద్భావంతో మెలగండి. దయార్థహృదయంతో.. వినయంతో వారి ముందు తలవంచి ఉండండి.

నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి

● ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కన్వీనర్ రాచకొండ విఘ్నేష్

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 1 : కేంద్రప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన జాతీయ విద్యా విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కన్వీనర్ రాచకొండ విఘ్నేష్ అన్నారు. సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను ప్రజాసంఘాల భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని ధ్వంసం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని, ఇందులో భాగంగానే కొత్తకొత్త సంస్కరణలతో విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నాయన్నారు. జిల్లాను ఎడ్యుకేషనల్ హబ్‌గా మార్చాలన్నారు. అదే విధంగా బాసర ట్రిపుల్ ఐటీకి అధిక నిధులను వెచ్చించాలన్నారు. లేనియెడల ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ నూతన జిల్లా కమిటీ ఎన్నిక

సోమవారం ఎస్ఎఫ్ఐ నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నవీన్, జిల్లా కార్యదర్శిగా దిగంబర్, ఉపాధ్యక్షులుగా పరమేష్, నితిన్, నీరజ, సహాయ కార్యదర్శులుగా నితిన్, చంద్రకాంత్, తదితరులను ఎన్నుకున్నారు.

పెరిగిన ధరలకు అనుగుణంగా

ఉపాధి కూలి ధరలను పెంచాలి

● వ్యవసాయ కార్మిక సంఘం

జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 1 : రోజురోజుకు పెరిగిపోతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి కూలి ధరలను రూ. 600లకు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఉపాధి హామీ కూలీల వేతనాలను 300ల రూపాయలకు పెంచి కేంద్ర ప్రభుత్వం చేతులు దులుపుకుంటుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా 300ల రూపాయలకు పెంచి కూలీలను పండగ చేసుకోమంటున్న నరేంద్ర మోదీ సర్కార్ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి హామీ కూలీల వేతనాన్ని 600 రూపాయలకు పెంచడంతో పాటు సంవత్సరానికి 200ల రోజులు పని దినాలు కల్పించాలన్నారు. అదే విధంగా గడ్డపార, తట్ట, పార కొనుగోలు చేసి ఇవ్వాలని, వారానికి ఒక్కసారి వేతనాలు చెల్లించాలన్నారు. ఉపాధి హామీ ఉద్యోగుల వేతనాలను నాలుగు నెలలు చెల్లించకుండా కేంద్ర ప్రభుత్వం నరకయాతన పెట్టిందని, నేటికీ టెక్నికల్ అసిస్టెంట్ల వేతనాలను చెల్లించలేదన్నారు. ఉపాధి హామీ పనులు జరుగుతున్న చోట వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సందర్శించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకుని ఆ సమస్యలపై పోరాటం చేయాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బర్కుంట గంగారాం, చందుల సాయికిరణ్ పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వేయాలి : సీఐ భూమేష్

సిరికొండ రూరల్, ఏప్రిల్ 1: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ భీమేష్ అన్నారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలో సోమవారం కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సీఐ భీమేష్ సూచించారు. ఇందుకోసం పోలీసుశాఖ, సీఆర్పీఎఫ్ బలగాలతో భద్రత కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సై నవీన్, పోలీసులు, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ

● హాజరైన ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ ● పిప్పల్‌గావ్‌లో ఆధ్యాత్మిక వాతావరణం ● పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం

జైనథ్, ఏప్రిల్ 1: మండలంలోని పిప్పల్‌గావ్ గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో మంగళవారం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య డప్పుబజాలు భజనల మధ్య హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దీంతో పాటు శివ పార్వతులు, నాగశేషుడు, నందీశ్వరుడు, గణేషుడు అన్నపూర్ణదేవి, సూర్య భగవానిడి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు ప్రవీణ్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, రాష్ట్ర మాజీ మంత్రి జోగు రామన్నలు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నది. ఈ సందర్భంగా గ్రామంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎస్.లింగారెడ్డి, గ్రామ సర్పంచ్ యు.అర్చన దిలీప్‌లతో పాటు పిప్పల్‌గావ్, గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.



పిప్పల్‌గావ్ ఆలయంలో ప్రతిష్ఠించిన హనుమాన్ విగ్రహం

● కూరలో అభయాంజనేయ స్వామి..

జైనథ్: మండలంలోని కూర గ్రామంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం అంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో డప్పులు, బాజాభజంత్రీల మధ్య భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. దీంతో పాటు ఆలయంలో శివపార్వతులు, గణేషుడు, సుబ్రమణ్య స్వామి విగ్రహాలను సైతం ప్రతిష్ఠించారు. ప్రధాన అర్చకుడు గొల్లపల్లి శ్రీధరచార్యులు, గొల్లపల్లి రామనందచార్య స్వాములు ఆధ్వర్యంలో పూజలు చేశారు. అలాగే మాజీ మంత్రి జోగు రామన్న హాజయ్యారు. ఈ సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు. ఇందులో సర్పంచ్‌లు అడ్డిలత వెంకట్‌రెడ్డి, ఎం.వెంకన్న, రైతు సమితి కోఆర్డినేటర్ ఎస్.లింగారెడ్డి, వీడీసీ ఛైర్మన్ రాజశేఖర్, తదితరులున్నారు.



మంత్రికి ఖర్జూరం తినిపస్తున్న మైనార్టీ నాయకులు

ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి సీతక్క

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 1: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక మసూద్ చౌక్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి సీతక్క, ఎంపీ అభ్యర్థి సుగుణక్కలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు మంత్రి, ఎంపీ అభ్యర్థి, ఆదిలాబాద్ ఇన్‌చార్జీలకు ఖర్జూరాలు, డ్రైఫ్రూట్స్‌లు తినిపించారు. ఇందులో ఆదిలాబాద్ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ జనరల్ సెక్రటరీ సత్తుమల్లేష్, అడ్డిభోజారెడ్డి, నాయకులు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

మంత్రి ఆధ్వర్యంలో పార్టీలో చేరికలు

తలమడుగు: కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలకు ఆకర్షితులైన బీఆర్ఎస్ పార్టీ నాయకులు సోమవారం మంత్రి సీతక్క, జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్, డీసీసీబీ ఛైర్మన్ అడ్డి భోజారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్‌ల ఆధ్వర్యంలో తలమడుగు మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకురాలు, రైతుబంధు డైరెక్టర్ కాటిపెల్లి సునితారెడ్డి, ఆర్లి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ వెంకట్‌రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరామన్నారు.

తాంసి: తాంసి మండల పరిషత్ అధ్యక్షులు మంజుల శ్రీధర్‌రెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర మంత్రి సీతక్క సమక్షంలో ఆయన కాంగ్రెస్ కండువా వేసుకున్నారు. ఆయనతో పాటు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 650 మంది బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు కూడా చేరారు.

'సేవే లక్ష్యంగా పేదలకు చికిత్సలు'

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 1: వైద్యవృత్తిలో ఉన్న వారు సేవే లక్ష్యంగా పేదలకు చికిత్సలు అందించాలని రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. సోమవారం నుంచి రిమ్స్‌లో హౌజ్ సర్జన్లుగా విధుల్లో చేరిన వారికి ఆయన పలు సూచనలు చేశారు. వార్డులు తిరుగుతూ వారు అందిస్తున్న చికిత్సల గురించి అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ మాట్లాడుతూ రిమ్స్‌కు వచ్చే పేద రోగులకు సేవ భావంతో చికిత్సలు అందించాలన్నారు. తాము ఉన్నామనే భరోసా కల్పించేలా సేవలుండాలని సూచించారు. రిమ్స్‌లో 101 మంది కొత్త హౌజ్ సర్జన్లు వచ్చారని తెలిపారు. ఇక నుంచి రిమ్స్‌లో మరింత నాణ్యమైన వైద్యులు అందుతాయన్నారు. రోగులు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే చికిత్సలు అందించేలా పూర్తి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

రక్తపు వాంతులతో ఒకరి మృతి

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 1: రక్తపు వాంతులు చేసి ఒక్కరూ మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని హీరాపూర్ గ్రామ పంచాయితీ పరిధిలోని లాల్‌టెకిడి గ్రామంలో జరిగింది. కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం లాల్‌టెకిడి గ్రామానికి చెందిన గణేష్ రాథోడ్ (45) కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త. గ్రామంలోనే ఉంటూ ఆర్ఎంపీ వైద్యుడిగా సేవలందిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం నుంచి రక్తపు వాంతులు చేశారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో సాయంత్రం వరకు రక్తపు వాంతులు చేశాడని తెలిపారు. అయితే, సాయంత్రం కుటుంబీకులు వచ్చి 108 అంబులెన్స్ సహాయంతో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించి చికిత్సలు అందించారు. పరిస్థితి విషమించడంతో రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య పరిమిళ బాయి ఉన్నారు. గణేష్ రాథోడ్ మృతి చెందడంతో లాల్‌టెకిడిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రైతులను నమ్మించి మోసగించిన ప్రభుత్వం

● రాష్ట్ర మాజీ మంత్రి జోగు రామన్న ధ్వజం

జైనథ్, ఏప్రిల్ 1: రాష్ట్రంలో రైతులు తీసుకున్న రూ.రెండు లక్షల రుణమాఫీ పేరుతో రైతులను నమ్మించి మోసగించిన సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వమని రాష్ట్ర మాజీ మంత్రి జోగు రామన్న తీవ్ర స్థాయిలో విమర్శించారు. మంగళవారం నీటిమట్టం లేక ఎండిపోతున్న మిర్చి, జొన్న పంటలను మండలంలోని కాప్రీ, ఉమ్రి, కరంజి గ్రామాల రైతులు నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండుతున్న ఎండలకు బావులు, బోర్లు, వాగుల్లో నీరు అడుగంటి పోయిందన్నారు. దీనిపై జిల్లా యంత్రాంగం అధికారులు ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదన్నారు. ఆదిలాబాద్ ఇన్‌చార్జీ మంత్రి సీతక్క కేవలం కాంగ్రెస్ పార్టీలో చేరికలకే పరిమితం అయిందని విమర్శించారు. రైతులు పండించిన సోయా శనగ పంటలు సకాలంలో కొనుగోలు చేయక గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వడగండ్ల వానలకు వరదలకు పంటలు నష్టపోయిన రైతులకు ఎకరంకు రూ.25వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుబంధు రైతుబీమా 24గంటల ఉచిత విద్యుత్ ఏమైందని ప్రశ్నించారు. జొన్న పంటలు జిల్లాలో 35వేల ఎకరాల్లో 5లక్షల క్వింటాళ్లు ఉందన్నారు. జొన్న పంటను ప్రభుత్వ కొనుగోలు చేయకపోతే జిల్లావ్యాప్తంగా రైతుల పక్షాన ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జైనథ్ మాజీ ఎంపీపీ ఎస్.లింగారెడ్డిలతో పాటు ఆయా గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.



కాప్రీలో ఎండిపోతున్న జొన్న పంటను పరిశీలిస్తున్న రామన్న

సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో
జిల్లా క్రీడాకారులకు గోల్డ్‌మెడల్

నేరడిగొండ, ఏప్రిల్ 1: ఇటీవల జరిగిన మహారాష్ట్రలోని ఔరంగాబాద్ డివిజన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మార్చి 29 నుంచి ఏప్రిల్ 1 వరకు 36వ సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ బాలబాలికల చాంపియన్‌షిప్ 23-24లో తెలంగాణ జట్టు పంజాబ్‌పై 3-1 రన్నుల తేడాతో గెలుపొంది ఛాంపియన్‌గా నిలిచారు. ఈ జట్టులో ఆదిలాబాద్ జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారిణిలు ప్రాతినిథ్యం వహించారు. నేరడిగొండ మండలం జడ్పీఎస్‌హెచ్‌లో 8వ తరగతి చదువుతున్న మంకాని అరుషి, కేజీబీవీ స్కూల్‌కి చెందిన శ్రీలేఖ 8వ తరగతి, అర్షిత 8వ తరగతి ఈ క్రీడాకారులు తెలంగాణ జట్టు తరపున ఆడి విజయానికి కృషి చేశారు. క్రీడాకారులను కోచ్ వీరగంటి అఖిలను ఈ సందర్భంగా క్రీడాకారులను జిల్లా అధ్యక్షుడు అనిల్ జాదవ్ ఎమ్మెల్యే, ఉపాధ్యక్షుడు గోడం జ్యోతిరాం, జిల్లా ప్రధాన కార్యదర్శి గస్కంటి గంగాధర్, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు మోహన్, నాగరాజ్ రాధేశ్యాం, పీఈటీ కవిత, స్నేహలు సంతోషం వ్యక్తం చేశారు. ఇంటర్ నేషనల్‌కు సెలెక్ట్ కావాలని అధ్యక్షుడు అనిల్‌జాదవ్ ఎమ్మెల్యే కొనియాడారు.

'ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో నడవాలి'

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 1: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావన కలిగి భక్తి మార్గంలో నడవాలని గిత్తే మారుతి మహరాజ్ అన్నారు. మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో అఖండ హరినామ సప్తాహ కార్యక్రమంలో భక్తులనుద్దేశించి మాట్లాడారు. సమాజంలో ప్రతిఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని సూచించారు. ఇందులో బాలు పటేల్, అనిల్, గణేష్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

'క్షయ రాకుండా జాగ్రత్తలు పాటించాలి'

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 1: క్షయ వ్యాధి రాకుండా హెల్త్‌కేర్ సిబ్బంది జాగ్రత్తలు పాటించాలని షేర్ ఇండియా ఆర్గనైజేషన్ వైద్యుడు సతీష్ తెలిపారు. సోమవారం పట్టణంలోని క్షయ నివారణ కేంద్రంలో హెల్త్‌కేర్ సిబ్బందికి టీబీ సోకకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. రోగుల నుంచి తెమడ, ఇతర పరీక్షలు, చికిత్సలు అందించే సమయంలో ఏవిధంగా ఉండాలో వివరించారు. ఇందులో షేర్ ఇండియా ఆర్గనైజేషన్ వైద్యుడు ప్రమోద్, క్షయ నివారణ కేంద్రం మెడికల్ ఆఫీసర్ సాయి ప్రియ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కుటుంబం వల్లే తెలంగాణ ఆగమైంది

● కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలి ● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



ఎర్వచింతల్‌లో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులకు కండువా వేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు



తర్లపాడ్‌లో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న అగ్గిమల్లన్న ఆలయ కమిటీ

ఖానాపూర్, ఏప్రిల్ 1 : కేసీఆర్ కుటుంబం వల్లే తెలంగాణ రాష్ట్ర ఆగమైందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం ఖానాపూర్ మండలంలని పలు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎర్వచింతల్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రాష్ట్రప్రభుత్వం గ్రామాల అభివృద్ధితో పాటు పేదల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం కింద 200ల యూనిట్ల ఉచిత కరెంట్‌తో పాటు రూ. 500లకే గ్యాస్ అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులు తమ సొంత నియోజకవర్గాలను మాత్రమే అభివృద్ధి చేశారని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందన్నారు. సరస్వతీ కెనాల్ ద్వారా రైతులకు నీళ్లు ఇచ్చి ఆదుకుంటామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై ప్రత్యేకశ్రద్ధ చూపి అభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తున్నారన్నారు. త్వరలోనే గ్రామ గ్రామాన తిరిగి సమస్యలు తెలుసుకుని, ఆ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. అనంతరం బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం కార్యకర్తలు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును శాలువాతో సత్కరించారు.

అగ్గిమల్లన్న ఆలయంలో ప్రత్యేకపూజలు

మండలంలోని తర్లపాడ్ గ్రామంలో అగ్గి మల్లన్న ఆలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి తనవంతుగా సహకరిస్తానన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బొజ్జును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దొనికేని దయానంద్, ఖానాపూర్ మున్సిపల్ ఛైర్మన్ రాజుర సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, ఎంపీటీసీ జంగిలి శంకర్, కట్ట శ్రీనివాస్, సార్ల నర్సయ్య, ఎర్వచింతల్ గ్రామ అధ్యక్షులు బిక్కు నాయక్, కే. నరేష్, మాజీ సర్పంచ్ చిన్న రాజన్న, కాన్షిరామ్ నాయక్, అంబాజి, మాజీ సర్పంచ్ సుతారి రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ వెంకటేష్, బలగం భీమన్న, తదితరులున్నారు.

వీగిన అవిశ్వాసం.. బీఆర్ఎస్‌దే వైస్ పీఠం



ఎంపీటీసీలు హాజరుకాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

సారంగాపూర్, ఏప్రిల్ 1 : మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు పతాని రాధపై ప్రవేశపెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. సోమవారం విశ్వాస పరీక్ష జరగాల్సి ఉండగా అవసరమైన ఎంపీటీసీలు హాజరు కాకపోవడంతో కోరం లేనదున అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు నిర్మల్ ఆర్డీవో రత్నప్రభ వెల్లడించారు. గత రెండు నెలల క్రితం వైస్ ప్రెసిడెంట్ పతాని రాధపై పలువురు ఎంపీటీసీ సభ్యులు అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెడుతూ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. బీజేపీకి మద్దతుగా నిలిచిన ఎంపీటీసీలు అవిశ్వాసం ప్రకటించగా క్యాంప్ రాజకీయాలకు తెరలేచింది. ఒకవైపు ఎంపీపీ, మరోవైపు వైస్ ఎంపీపీలపై అవిశ్వాసం ప్రకటించగా ఎంపీపీ అట్ల మహిపాల్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. నాటకీయ పరిణామాల మధ్య ఎంపీపీ ఎన్నిక జరగగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎంపీటీసీని ఎంపీపీ పదవి వరించింది. తక్షణమే సదరు ఎంపీపీ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోవడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు సోమ వారం వైస్ ఎంపీపీపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోవడంతో ఈ వ్యవహారంలో బీఆర్ఎస్ పార్టీదే పైచేయి అయినట్లు స్పష్టమవుతోంది. మొత్తానికి అవిశ్వాస రాజకీయం సారంగాపూర్ మండలంలో వేడి పుట్టించింది.

'కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా'

మామడ, ఏప్రిల్ 1 : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన మామడ మండలంలోని పోన్కల్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎం. లింగన్న అన్నారు. సోమవారం మండల కమిటీ ఆధ్వర్యంలో నూతన గ్రామ, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. ఈ కమిటీలు పోన్కల్ గ్రామ అధ్యక్షులుగా ఎం.లింగన్న, ప్రధాన కార్యదర్శిగా మనోహర్, వైస్ ప్రెసిడెంట్‌గా పి. రాజన్న, పి. రాజారెడ్డి, సంయుక్త కార్యదర్శి పెద్దింటి వెంకటి, కోశాధికారిగా పందిరి నర్సయ్య, సభ్యులుగా కోరుట్ల గంగన్న, దుబాక గంగన్నలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నల్ల లింగారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సలకం శేఖర్, సంయుక్త కార్యదర్శి రెడ్డి నర్సారెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ముథోల్, ఏప్రిల్ 1 : రైతులు వరి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ సీఈవో సాయరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన ముథోల్‌లో సోమవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ రకం వరి ధాన్యం క్వింటాల్‌కు రూ. 2,203, బి రకం వరి ధాన్యం క్వింటాల్‌కు రూ. 2,183లు చెల్లించడం జరుగుతుందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత వరి కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులు దళారులకు ధాన్యాన్ని విక్రయించి మోసపోకుండా ఉండేందుకే పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ప్రవీణ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ జిల్లాకేంద్రంలో
కత్తిపోట్ల కలకలం

● ఒకరికి తీవ్ర గాయాలు ● జిల్లాసుపత్రికి తరలింపు

నిర్మల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి కత్తిపోట్ల ఘటన కలకలం రేపింది. ఆదిలాబాద్ జిల్లాలోని నేరడిగొండ మండలం బందన్ గ్రామానికి చెందిన నారాయణ రోల్ మామడ గ్రామంలోని విద్యుత్ ఉపకేంద్రం పనిచేస్తుంటాడు. సోమవారం రాత్రి నిర్మల్ బస్టాండ్ వద్ద అతనిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. దాడికి పాల్పడ్డ వ్యక్తి మద్యం తాగి ఉన్నట్లు తెలుస్తోంది. దాడిలో నారాయణకు తీవ్రగాయాలు కావడంతో.. స్థానికులు అతన్ని వెంటనే నిర్మల్‌లోని జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడే ఉన్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి వచ్చి దాడికి పాల్పడ్డ వ్యక్తిని పట్టుకున్నారు. కాగా.. ఇద్దరు వ్యక్తులు ఒకేచోట మద్యం తాగుతూ ఉండగా.. జరిగిన చిన్నపాటి గొడవనే ఈ కత్తిపోట్లకు కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. డీఎస్పీ గంగారెడ్డి ఆస్పత్రిలో బాధితుడు నారాయణను పరామర్శించి.. ఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు.


'చెక్‌పోస్ట్ వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలి'



అధికారులకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ

సారంగాపూర్, ఏప్రిల్ 1 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టల వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చించోలి(బి) ఎక్స్ రోడ్ వద్ద నిర్మల్, ఆదిలాబాద్ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను పరిశీలించి విధులు నిర్వహిస్తున్న అధికారులకు సూచనలను ఇచ్చారు. పటిష్టంగా నిఘా చర్యలు చేపట్టి విస్తృత తనిఖీలు నిర్వహించాలని పోలీస్ సిబ్బందితో పేర్కొన్నారు. సరిహద్దుల్లో ఉన్నటువంటి చెక్‌పోస్టల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేసి సమయంలో వీడియోలతో పాటు ఫోటోలు తీయడంతో పాటు 24 గంటల పాటు చెక్‌పోస్టల వద్ద నిఘా పెట్టి తనిఖీలు నిర్వహించి వెంటనే సమాచారాన్ని అందించాలన్నారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై చంద్రమోహన్‌లు ఉన్నారు.

రోడ్డు పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



దిలావర్‌పూర్, ఏప్రిల్ 1 : అధికారుల అనాలోచిత చర్యలు ప్రయాణికులకు ప్రాణ సంకటమయ్యే ప్రమాదం పొంచి ఉంది. మండలంలోని బన్సపల్లి శివారులో వ్యవసాయ విద్యుత్ సరఫరా కోసం కొత్తగా 11 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. అయితే సురక్షిత ప్రాంతంలో ఏర్పాటు చేయాల్సిన ట్రాన్స్‌ఫార్మర్‌ను నిర్మల్ - బన్సపల్లి ప్రధాన రహదారి ప్రక్కనే ఏర్పాటు చేసేందుకు గద్దెను నిర్మించారు. ఈ రహదారిపై రాత్రి, పగలు బన్సపల్లి, కంజర్ గ్రామాల ప్రజలు ప్రయాణిస్తూ ఉంటారు. రోడ్డుకు ప్రక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తుండటంతో అనుకోకుండా ప్రమాదం జరిగి ప్రాణాలు పోయే అవకాశం ఉండటంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న ప్రదేశానికి కొద్ది దూరంలోనే రోడ్డు మూల మలుపు ఉంది.

andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 39.4 కనిష్ఠం 26.1



నిర్మల్
జిల్లా వార్తలు

మంగళవారం 2 ఏప్రిల్ 2024

ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వండి : పీఆర్టీయూ

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 1 : దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులు, వికలాంగులు, గర్భిణులు మహిళలకు పార్లమెంట్ ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని పీఆర్టీయూ అధ్యక్షుడు సాయన్న, ప్రధాన కార్యదర్శి రవిరాజ్ కోరారు. సోమవారం వారు కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. పోలింగ్ కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేయాలని, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచడంతో పాటు ఎన్నికల విధులు పూర్తయిన తరువాత సిబ్బందిని గమ్యస్థానాలకు చేరేందుకు తగిన రవాణా సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు షురూ!



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

- జిల్లాలో 203 కేంద్రాల ఏర్పాటు
- 30 లక్షల గన్నీ బ్యాగుల సేకరణ
- ఏ గ్రేడ్ మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 2203
- గన్నీ బ్యాగులు, ఇతర సౌకర్యాలపై దృష్టి
- ధాన్యం నిల్వలే అసలు సమస్య

నిర్మల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో యాసంగి వరి పంట కొనుగోలు కోసం అధికార యంత్రాంగం అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ అశిష్‌సంగ్వాన్ కొనుగోలు ప్రక్రియకు సంబంధించిన కార్యాచరణను రూపొందించారు. దీనికి అనుగుణంగా జిల్లాలో మొత్తం 203 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించారు. ఈ యాసంగి సీజన్‌లో 1,09, 902 లక్షల ఎకరాల్లో వరిపంటను సాగుచేస్తున్నారు. దీనికి అనుగుణంగా 1,97,285 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ధారించారు. మొత్తం 203 కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి ఎప్పటికప్పుడు ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు సిద్దమవుతున్నారు. సోమవారం నుంచి జిల్లాలో కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైంది. అయితే మొదటిరోజూ మండలంలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసి అక్కడ కొనుగోళ్లను ప్రారంభించాలని నిర్ణయించారు. కాగా ప్రభుత్వం ఇప్పటికే ధాన్యం మద్దతు ధరను సైతం ప్రకటించింది. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు గానూ రూ. 2203, కామన్‌రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 2183లుగా ఖరారు చేసింది. మద్దతు ధర రైతులకు గిట్టుబాటు కానుండడంతో వారంతా దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని అమ్ముకునే వీలు కలుగుతోంది. కాగా తేమ శాతం 17 ఉండాలని అధికారులు నిబంధనలు విధిస్తున్నారు. తేమ విషయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమయ్యే అన్ని రకాల ఏర్పాట్లను కల్పించాలని కూడా కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు తారాస్థాయికి చేరుకోవడం, రోజురోజుకూ వేడిగాలులు ముదిరిపోతున్న కారణంగా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటూ రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోనున్నారు.

మొత్తం 203 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

జిల్లావ్యాప్తంగా మొత్తం 203 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు నిర్ణయించారు. అయితే ఈ సారి గతానికి భిన్నంగా ప్రాథమిక రైతు సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో 89 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. గతంలో ఐకేపీకి ఎక్కువ కొనుగోలు కేంద్రాలను కేటాయించేవారు. ఈ సారి మాత్రం ఐకేపీకి 51 కొనుగోలు కేంద్రాలను కేటాయించారు. డీసీయంయస్ ఆధ్వర్యంలో 58 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనుండగా, డీసీసీ ఆధ్వర్యంలో 05 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. దశల వారీగా మొత్తం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతుల నుంచి మద్దతు ధరతో పూర్తిస్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నారు. కాగా ప్రతీరోజూ ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఉన్నతాధికారులకు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. దశల వారీగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తూ రైతులకు ఈ కేంద్రాలపై అవగాహన కల్పించాలని కూడా సూచిస్తున్నారు. దళారుల బారిన పడకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతుల తమ ధాన్యాన్ని అమ్ముకోవాలంటూ కూడా గ్రామస్థాయిలో ప్రచారం చేపడుతున్నారు.

గన్నీ బ్యాగులు, ఇతర సౌకర్యాలపై దృష్టి

కాగా గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఈ సారి గన్నీ బ్యాగుల సమస్య ఎదురుకాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోబోతున్నారు. దీంతో పాటు కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్‌మిల్లులకు తరలించేందు కోసం గానూ ట్రాన్స్‌పోర్టు సౌకర్యాన్ని కూడా పకడ్బందీగా చేపడుతున్నారు. ఇందులో భాగంగానే వాహనాల కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే సంబంధిత అధికారులు రవాణాశాఖ అధికారులతో వాహనాల విషయమై కార్యాచరణ రూపొందించారు. కాగా జిల్లాలో మొత్తం 49లక్షల గన్నీబ్యాగులు అవసరం ఏర్పడుతుండగా, ఇప్పటి వరకు 30 లక్షల గన్నీబ్యాగులు అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. మరో 19 లక్షల గన్నీ బ్యాగులను జిల్లాకు రప్పించేందు కోసం గాను అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. కాగా రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యంతో పాటు టెంట్‌లు వేసి నీడ కల్పించాలని కూడా అధికారులు సూచిస్తున్నారు. మిట్ట మధ్యాహ్నం వేళ కొనుగోళ్లను నిలిపి వేసి సాయంత్రం వేళ చేపట్టాలంటూ కూడా మౌఖికంగా పేర్కొంటున్నారు.

ధాన్యం నిల్వ అసలు సమస్య

కాగా జిల్లాలోని 203 కొనుగోలు కేంద్రాల నుంచి మొత్తం 1,97,285 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించనున్నారు. ఇలా కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్‌మిల్లులకు తరలించి సీఎంఆర్ కింద మిల్లింగ్ చేయాల్సి ఉంటుంది. అయితే గత ఖరీఫ్, రబీ సీజన్‌లకు సంబంధించి సేకరించిన ధాన్యాన్ని ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో మిల్లింగ్ చేయని కారణంగా చాలా రైస్‌మిల్లుల్లో ధాన్యం బస్తాలు కుప్పలు తెప్పలుగా పేరుకు పోయాయి. ఈ క్రమంలోనే ప్రస్తుతం యాసంగి సీజన్ కోసం సేకరించే ధాన్యాన్ని ఎప్పటికప్పుడు నిల్వ చేయడం సర్కారుకు కత్తి మీద సాములా మారనుందని అంటున్నారు. ఎప్పటికప్పుడు రైస్‌మిల్లులు లేదా గోదాంలకు తరలిస్తేనే కొనుగోలు చేసిన ధాన్యం సురక్షితంగా ఉంటుందని అంటున్నారు. ఇప్పటికే కొన్ని రైస్‌మిల్లుల్లో సేకరించిన ధాన్యమంతా చెడిపోయిన సంగతి తెలిసిందే. దీనిపై కలెక్టర్ సైతం తనిఖీలు చేసి సదరు రైస్‌మిల్లులపై కేసులు కూడా నమోదు చేయించారు. అయితే ఈ సారి యాసంగి సీజన్‌లో కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని నిల్వ చేసే అంశంపైనే సంబంధిత అధికారులు సీరియస్‌గా దృష్టి సారిస్తున్నారు.

చిట్యాల్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో జిల్లా అధికారులు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 1 : నిర్మల్ మండలం చిట్యాల్ గ్రామంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రారంభించారు. జిల్లాలో 16 కేంద్రాల ప్రారం భంతో పాటు రైతులకు ఇబ్బందులు కాకుండా ఏర్పాట్లు చేశామన్నారు. అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, మార్కెటింగ్ ఏడీ అశ్వాక్, పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీకళ, నందిత పాల్గొన్నారు.

ఆలూర్ సొసైటీ ఆధ్వర్యంలో..

సారంగాపూర్, ఏప్రిల్ 1 : మండలంలోని ఆలూర్‌లో సొసైటీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులందరూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని, దళారులకు విక్రయించి మోసపోవద్దని పేర్కొన్నారు. ధాన్యం క్వింటాల్‌కు ఏ గ్రేడ్ రూ. 2,203లు, బి గ్రేడ్ క్వింటాల్‌కు రూ. 2,183లను ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటిస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లోకి విక్రయించడానికి తీసుకువచ్చిన ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీసీవో నర్సయ్య, డీఎస్‌వో నందిని, డీఎం శ్రీకళ, ఏవో రాజశేఖర్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రమాదేవి, సీఈవో మల్లేష్ లతో పాటు అధికారులు, రైతులు ఉన్నారు



ఘనంగా రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు



నదీతీరంలో అమ్మవారి విగ్రహాలతో భక్తులు

ఖానాపూర్, ఏప్రిల్ 1 : మండల కేంద్రంలోని గోదావరి నది శివారులోని రేణుక ఎల్లమ్మ ఆలయ అష్టమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా సాగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా సోమవారం గంగస్నానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి ఉత్సవ విగ్రహాలను పవిత్ర ఉత్తర వాహినికి తరలించారు. ఉత్సవ విగ్రహాలకు గోదావరిలో నదీస్నానం నిర్వహించారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న చైర్మన్

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 1 : బుధవార్‌పేట్‌లో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు చైర్మన్ ఈశ్వర్ సోమవారం హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



అమ్మవారిని దర్శించుకున్న ఈశ్వర్

పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలి

నిర్మల్ అర్బన్ : ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంట్ ఎడ్యుకేషన్, శ్రీ గ్రీన్‌వర్క్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వాడరాలపై జరిగే అనర్థాలపై సోమవారం మున్సిపల్ కార్యాలయంలో విద్యార్థులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్లాస్టిక్‌తో పర్యావరణానికి పెనుముప్పు వాటిల్లే ప్రమాదముందని, ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని కోరారు.

పటేల్ యూత్ గర్జన పోస్టర్ ఆవిష్కరణ

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 1 : ఈ నెల 14న కరీంనగర్‌లో నిర్వహించే పటేల్ యూత్ గర్జన పోస్టర్లు, స్టిక్కర్లు మున్సిపల్ ఛైర్మన్ ఈశ్వర్ సోమవారం ఆవిష్కరించారు. యూత్ గర్జనను మున్నూరు కాపులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అయన్నగారి భూమయ్య, ఎంసీ లింగన్న, కొట్టే శేఖర్, లక్కాకుల నరహరి, గండ్రత్ రమణ, పాకాల రాంచందర్, గుమ్ముల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

'దళారులను ఆశ్రయించి మోసపోకండి'



లక్ష్మణచాందలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

లక్ష్మణచాంద, ఏప్రిల్ 1 : దళారులను ఆశ్రయించి మోసపోవద్దని వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ సోమవారం అన్నారు. మండలంలోని పీచర గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో, లక్ష్మణచాంద గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం ఈ కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రతి క్వింటాల్ వరి ధాన్యానికి ఏ గ్రేడ్‌కు రూ. 2,203, బి గ్రేడ్‌కు రూ. 2,183ల మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. తరుగు గాని, క్యాస్ కటింగ్ గాని, ఇతర ఎలాంటి కోతలు లూకుండా కొనుగోలు చేస్తున్న ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా మేనేజర్ ప్రమోద్, ఏఈవోలు పవిత్ర, ఉమా మహేశ్వరి, సంతోష్, పీఏసీఎస్ సీఈవో ఉదయ్ కుమార్, డీసీఎంఎస్ నిర్వాహకుడు గరిపెల్లి రాజు, శ్రీనివాస్, నర్సయ్య, రమణ, సతీష్, సాయి, రాజేశ్వర్, తదితరులు ఉన్నారు.

ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర కీలకం : కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



శిక్షణలో సూచనలిస్తున్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 1 : ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. సోమవారం పోలింగ్ నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈవీఎం యంత్రాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు అమర్చడం మాక్ పోలింగ్ తదితర వాటిపై పూర్తిగా తెలుసుకోవాలన్నారు. ఓటింగ్ గోప్యత నిబంధనలు, టెండర్ ఓట్లు, ఛాలెంజ్ ఓట్లు ఇతర వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే సౌకర్యం కల్పించడంతో పాటు ప్రత్యేక క్యాజువల్ లీవ్ మంజూరు చేయనున్నామని తెలిపారు. మాస్టర్ ట్రైనీలు శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి శిక్షణపై అవగాహన కల్పించారు. శిక్షణల నోడల్ అధికారి రవీందర్ రెడ్డి, డీఆర్‌వో భుజంగరావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు

సీఎస్ శాంతికుమారి సోమవారం సచివాలయం నుంచి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్‌తో పాటు అధికారులు హాజరయ్యారు. వేసవిలో తాగునీటి సరఫరా, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, వడదెబ్బ తగలకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదేశాలిచ్చారు. అదనపు కలెక్టర్లు కిషోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్, డీఆర్డీవో విజయలక్ష్మి, వైద్యాధికారి ధనరాజ్, డీఈవో రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రవీంద్రనగర్ తండాలో సమస్యలు తెలుసుకున్న కలెక్టర్

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

సారంగాపూర్, ఏప్రిల్ 1 : గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని మండల స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం మండలంలో గల రవీంద్రనగర్ తండాను ఆయన పరిశీలించి తండా వాసులను తాండాలలోని సమస్యలను అడిగి తెలుసుకొని అధికారులకు తండాలో నెలకొని ఉన్నటువంటి సమస్యలను వెంటనే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలను జారీ చేశారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని త్రాగునీటి సమస్యలపై దృష్టి సారించాలని అధికారులతో పేర్కొన్నారు. తండాలో తాగునీటి ఎద్దడి లేకుండా ఉండడానికి ఇటీవలే తండాలో వేసినటువంటి బోర్‌వెల్‌ను ఆయన పరిశీలించారు. ఈయన వెంట డీపీవో శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ సందీప్, ఎంపీవో తిరుపతిరెడ్డిలతో పాటు గ్రామస్థాయి అధికారులు ఉన్నారు.

వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలి

నిర్మల్ కల్చరల్ : వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ కోరారు. సోమవారం వడదెబ్బ పోస్టర్ ఆయన ఆవిష్కరించారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలలో వడదెబ్బపై టామ్‌టామ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో పార్లమెంట్ ఎన్నికల విధులపై అధికారులకు శిక్షణ



ఎన్నికల నిర్వహణపై అధికారులకు శిక్షణ కల్పిస్తున్న ఉట్నూర్ ఆర్డీవో

ఖానాపూర్, ఏప్రిల్ 1 : రానున్న పార్లమెంట్ ఎన్నికల విధులపై పీవో, ఏపీవోలకు సోమవారం ఖానాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉట్నూర్ ఆర్డీవో జీవాకర్ రెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా ఈవీఎంల నిర్వహణ, 17సి, 17ఎ, పీవో డైరీ, పీవో డిక్లరేషన్, ఓటరు స్లిప్స్, మాక్ పోలింగ్ తదితర అంశాలపై అధికారులకు శిక్షణ కల్పించారు. అనంతరం చివరి సెషన్‌లో ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివరాజ్, ఎంఈవో మధుసూదన్, ఎలక్షన్ సమన్వయకర్త జి. లింబాద్రితో పాటు పలువురు మాస్టర్ ట్రైనీలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు బిల్లు ఇప్పించాలని నిరసన

లక్ష్మణచాంద, ఏప్రిల్ 1 : సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లులను ఎగ్గొట్టేశారని ఆరోపిస్తూ మండలంలోని చామన్‌పెల్లి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ చొక్కాల బాపయ్య సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ భవనం ముందు అందుకు సంబంధించిన ఆధారాలతో నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలోని గూండ్ల గణేష్ ఇంటి నుంచి ఏలేటి మహిపాల్ రెడ్డి ఇంటి వరకు 200 మీటర్ల సీసీ రోడ్డును నిర్మించామన్నారు. ఇందుకు సంబంధించిన నిధులు 1,69,785 రూపాయలు రావాల్సి ఉందన్నారు. ఈ విషయంలో అప్పటి స్థానిక మాజీ సర్పంచ్‌ను ఎన్నిసార్లు అడిగినా అమౌంట్ ఇంకా బ్యాంకులో జమ కాలేదని బుకాయించారన్నారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించిన ఎంబీ రికార్డును సేకరించి బ్యాంకులో విచారణ జరుపగా ఈ మొత్తంను డ్రా చేసి వాడుకున్నట్లు తేట తెల్లమైందన్నారు. కాబట్టి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తనకు రావాల్సిన మొత్తాన్ని ఇప్పించాలని ఆయన కోరారు. లేని పక్షంలో ఆయన పదవీకాలంలో జరిగిన పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ నిర్వహింపజేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో మాజీ సర్పంచ్ ఏనుగు రామ్‌రెడ్డి వివరణ కోసం ఆయన కుమారుడి ద్వారా ప్రయత్నం చేయగా స్పందించలేదు. ఈ సందర్భంలో మాజీ వార్డు సభ్యులు అయిట్ల శ్రీనివాస్ కూడా ఉన్నారు.



సంక్షిప్త సమాచారం

బీజేపీకి రాజీనామా

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 1 : సోన్ మండలం గంజాల్ మాజీ ఉప సర్పంచ్ గంట దరుమ్‌బాయి ముత్తన్న, మండల కోఆప్షన్ సభ్యుడు ఫక్రుద్దీన్ సోమవారం బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు పేర్కొన్నారు.

మొక్కజొన్న పంట దగ్ధం



దగ్ధమైన మొక్కజొన్న పంటను చూయిస్తున్న రైతు

కుంటాల, ఏప్రిల్ 1 : మండలంలోని ఓలా శివారులో అమీరుద్దీన్ అనే రైతుకు చెందిన రెండెకరాల మొక్కజొన్న సోమవారం దగ్ధమైంది. ప్రమాదవశాత్తు కొంతభాగం కాలిపోగా భైంసా ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో వచ్చి మంటలను ఆర్పివేశారు. దాదాపు రూ. 30 వేల వరకు నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వేడుకుంటున్నాడు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

కుంటాల, ఏప్రిల్, 1 : మండలంలోని కల్లూరు వాసవి కళాశాలలో సోమవారం గ్రాడ్యుయేషన్‌డే నిర్వహించారు. గడిచిన విద్యా సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పట్టాలను స్థానిక సిబ్బంది అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ జానకిరామ్, ప్రిన్సిపాల్ సుధాకర్ ఉన్నారు.

రైతు విగ్రహ ప్రతిష్ఠాపన



కుంటాల మున్నూరుకాపు సంఘం ఆవరణలో రైతు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

కుంటాల, ఏప్రిల్, 1 : మండల కేంద్రం కుంటాల స్థానిక మున్నూరుకాపు సంఘం ఆవరణలో సోమవారం రైతు విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి మున్నూరుకాపు సంఘం తాలుకా అధ్యక్షులు రోల్ల రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు లేనిదే రాజ్యం లేదని, రైతు దేశానికి వెన్నెముక లాంటివాడని కావున ప్రతిఒక్క రైతును కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతు విగ్రహాన్ని కొత్తకాపు గంగన్న విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గోవింద్ రాజు, కుంటాల మండల మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు పట్లే రఘు, మాజీ జడ్పీ ఛైర్మన్ జుట్టు అశోక్, పీఏసీఎస్ ఛైర్మన్ సట్ల గజ్జారాం సంఘ సభ్యులు ఉన్నారు.